‘మతం పేరుతో బీజేపీ రాజకీయం’

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్: ‘మతం పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీకి రోజులు దగ్గర పడ్డాయని’ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ‘మత రాజకీయాలు చేసే వారికి తగిన గుణపాఠం చెప్పాలని’ ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ గోషామహాల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

- రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం నలుమూలలా అభివృద్ధి జరుగుతుంటే బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచినా గోషామహాల్‌లో మాత్రం అభివృద్ధి కుంటుపడిందన్నారు.
- గత కొన్నేళ్లుగా నియోజకవర్గం నలుమూలలా కోట్లాది రూపాయలతో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు.
- కరోనా సమయంలో సైతం ఆదిత్య కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటా నిత్యావసరాలు అందించిన ఘనత నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కే దక్కిందన్నారు.
- వచ్చే ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గోషామహాల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు ముందుంటామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

- సీఎం కేసీఆర్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందించేందుకు కృషి చేస్తామని ప్రతి కార్యకర్త, నాయకులు సైనికులుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో గోషామహాల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలన్నారు.

పార్టీ జెండా ఆవిష్కరణ...

- బీఆర్ఎస్ పార్టీ జెండాను గోషామహాల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆవిష్కరించారు. పూజవ్యాస్ బిలాల్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు ఆర్‌వీ.మహేందర్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు మమతాగుప్తా, ముఖేష్‌సింగ్, బీఆర్ఎస్ నేతలు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, సంతోష్ గుప్తా, ధన్‌రాజ్, పురుషోత్తమ్‌రావు, ప్రియాగుప్తా, శీలం సరస్వతి, యాదగిరి, సునిల్‌సాహు, ముఖేష్ ముదిరాజ్, ఆనంద్‌సింగ్, సురేష్ ముదిరాజ్, రవీంద్రచారి, కోటి శైలేష్‌కురుమ, ఆశీష్‌కుమార్‌యాదవ్, దీప, అనిత, లత, అరుణ


జెండాను ఆవిష్కరిస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

తదితరులు పాల్గొన్నారు.

గుర్రాలపై ర్యాలీ..

- ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు నగర మాజీ గ్రంథాలయ ఛైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గుర్రాలపై ర్యాలీగా తరలివచ్చారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది కార్యకర్తలు నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలివచ్చి సమావేశంలో పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీసీఐ ఎక్స్‌లెన్సీ బ్రోచర్ ఆవిష్కరణ

నాంపల్లి: ‘ద ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ’ (ఎఫ్.టీ.సీ.సీ.ఐ) వార్షిక ఎక్స్‌లెన్సీ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులు రాణిస్తున్న ప్రముఖ సంస్థలకు ఎఫ్.టీ.సీ.సీ.ఐ ప్రతిఏటా వార్షిక ఎక్స్‌లెన్సీ అవార్డులను అందజేస్తోంది.

- గత 49 ఏళ్లుగా ఎక్స్‌లెన్సీ అవార్డుల పరంపర నిరంతరాయంగా కొనసాగిస్తూ ముందుకెళ్తోంది. ఈ ఏడాది 22 కేటగిరీలకు అదనంగా స్టార్టప్ కంపెనీలకు కూడా అవార్డులను అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్.టీ.సీ.సీ.ఐ అధ్యక్షుడు అనీల్ అగర్వాల్ ఎక్స్‌లెన్సీ అవార్డుల వివరాలను వెల్లడించారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ సభ హెచ్‌ఐసీసీలో జరుగుతుందని తెలిపారు.
- నామినేషన్ ఫీజు మే 15 లోగా చెల్లించాల్సి ఉంటుందని ఎంట్రీలను మే 31వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. అవార్డు గ్రహీతల ఎంపిక ఎంతో పారదర్శకంగా జరుగుతుందన్నారు.
- ఎలాంటి పైరవీలకు అవకాశం ఉండదని పరిశ్రమ, వాణిజ్య రంగంలో రాణిస్తున్న సంస్థల ప్రతిభ, నాణ్యతలను ప్రామాణికంగా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ అవార్డుల ఎంపిక కమిటీలో రిటైర్డ్ జడ్జీలు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఉంటారని పేర్కొన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అనీల్ అగర్వాల్, మీలా జయదేవ్ అరుణ్ లుహరుకా తదితరులు

- ఎగుమతులు, మార్కెటింగ్, ఇన్నోవేషన్, ఆర్ అండ్‌డీ, టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎంప్లాయిస్ వేల్ఫేర్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ, టూరిజం ప్రమోషన్, ఛాంబర్/అసోసియేషన్, వ్యక్తులు–సైంటిస్ట్/ఇంజినీర్, ప్రెన్యూర్, ప్రెనియర్ వంటి రంగాల్లో అవార్డులను ఇవ్వడం జరుగుతుందన్నారు.
- మహిళా సాధికారత, దివ్యాంగులు, సాంఘీక సంక్షేమ కార్యక్రమాలు తదితర కేటగిరీల్లో కూడా అవార్డులను ఎంపిక చేస్తామన్నారు. ఎక్స్‌లెన్సీ అవార్డుల కమిటీ చైర్మన్ అరుణ్ లుహరుకా, సీనియర్ ఉపాధ్యక్షులు మీలా జయదేవ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా, సురేష్ కుమార్, ఖ్యాతి నరవణే తదితరులున్నారు.

క్లుప్తంగా...

జలమండలి ఎండీకి కలిసిన యూనియన్ నాయకులు


దాన కిషోర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: ఉద్యోగులు అన్ని వర్గాల పండుగలను కలిసి మెలిసి నిర్వహించుకోవడం అభినందనీయమని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ దాన కిషోర్ అన్నారు. మంగళవారం జలమండలి మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఖాజా జౌహర్ అలీ తదితరులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జలమండలి ఉద్యోగులు క్రమశిక్షణ, అంకిత బావానికి పెట్టింది పేరన్నారు. జలమండలి ఉద్యోగులు ఒకే విధంగా 24 గంటలు ప్రజాసేవలోనే ఉంటారన్నారు. నీటి సరఫరాలో ఏ మాత్రం అవాంతరాలు ఎదురైనా పగలు రాత్రి తేడా లేకుండా వెంటనే వారు రంగంలోకి దిగి నీటి సరఫరాను పునరుద్ధరిస్తారన్నారు. మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదర్, ప్రధానకార్యదర్శి సయ్యద్ అక్తర్, మజర్ ఉద్దీన్ తదితరులున్నారు.

కేంద్ర సంఘం ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

అబిడ్స్: టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ఎన్నికలను సమర్థవంతంగా జరపాలని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా నాయకులు తీర్మానించారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నెలలో జరిగే కేంద్ర సంఘం ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి పదవికి డాక్టర్ ముజీబ్ హుస్సేన్ పోటీ చేయాలని అందరూ తీర్మానం చేశారు. ముజీబ్ హుస్సేనీను భారీ మెజార్టీతో గెలిపిస్తామని వారు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగులకు అండగా ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడున్నారన్నారు.

హైకోర్టులో ఏజీపీగా మంచర్ల విష్ణువర్ధన్



చార్మినార్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా మంచర్ల విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు అడ్వకేట్ జనరల్ బీ.ఎస్.ప్రసాద్ ఆయనకు నియమాక ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆయన గత కొన్నేళ్లుగా తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఏజీపీగా నియమితులైన సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం


బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: క్రీడాకారులు ఆటల పోటీల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీక ధారుఢ్యాన్ని పొందుతారని జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం లగోరి ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ జరిగింది. ముఖ్య అతిథిగా రాకేష్ జైస్వాల్ హాజరై విజేతలకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు క్రీడాకారుల భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. సరిత, రాఘవన్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి రిమాండ్

గౌలిపురా: భార్యపై అనుమానంతో దాడి చేసి హత్య చేసిన ఘటనలో భర్తను మొఘల్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... బాలాగంజ్ ప్రాంతానికి చెందిన పద్మజా (35), వెంకటేశ్వర్‌రావు (44)లు దంపతులు. కాగా వీరికి ఇద్దరు సంతానం. కాగా భార్య పద్మజపై గత కొద్ది రోజులుగా అనుమానంతో భర్త మద్యం సేవించి పలుమార్లు దాడికి పాల్పడ్డాడు. దీనిలో భాగంగానే ఈ నెల 23న తెల్లవారు జామున భార్యతో గొడవ పడి సుత్తెతో పలుమార్లు తలపై దాడికి పాల్పడ్డాడు. ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

హజ్, ఉమ్రా యాత్ర అదృష్టం అందరికీ కలగాలి

గోల్కొండ: పవిత్ర హజ్, ఉమ్రా యాత్రకు వెళ్లే అదృష్ట భాగ్యం ప్రతి ఒక్కరికీ కలగాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్లి తిరిగి వచ్చిన ఎస్.కే.బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత షబ్బీర్‌ఖాన్‌ను మంగళవారం టోలిచౌకీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌ఖాన్ మక్కా మదీనా నుంచి తెచ్చిన కర్జూర పండ్ల ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హజ్ ఉమ్రా పవిత్ర యాత్రలకు 40 ఏళ్లు దాటిన వారితో పాటు సీనియర్ సిటిజన్లు మాత్రమే వెళ్తున్నారన్నారు.

- యువకులు, ఉద్యోగులు మాత్రం హజ్, ఉమ్రా యాత్ర చేసే విషయంపై ఆలోచించన చేయడం లేదని ఆయన అన్నారు.
- ఒకసారి పవిత్ర నగరాలైన మక్కా, మదీనాలా దర్శనం చేసుకుంటే జీవితంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ యాత్రలు చేసిన వారు తాము చేస్తున్న వ్యాపారం, ఉద్యోగాలలో విజయాలు సాధిస్తారన్నారు.


ఎమ్మెల్యేకు మక్కా కజూర్‌ను అందిస్తున్న షబ్బీర్ ఖాన్

- ఉమ్రా, హజ్ యాత్రలకు వెళ్లే వారు అల్లా కృపకు పాత్రులవుతారని పేర్కొన్నారు. మజ్లిస్ నాయకులు బదర్ ఉద్దీన్, సయ్యద్ జహంగీర్, హబీబ్ చావూస్, ఖతాల్ తదితరులున్నారు.

ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న కిసాన్ మోర్చా నాయకులు

గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులపట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోందని గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు రావుల మాణిక్ ప్రభు ఆరోపించారు. మంగళవారం గుడిమల్కాపూర్‌లోని కిసాన్ మోర్చా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వడగండ్లు, అకాల వర్షాలతో రైతుల చేతికొచ్చే పంటలు దెబ్బతిన్నాయని దీని వల్ల ఎందరో పేద రైతులు ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

- బాధిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు హామీలే తప్పా.. ఆర్థిక సాయం అందించలేదన్నారు. రైతులకు రుణాలు ఇవ్వడం లేదని వారి రుణాలను మాఫీ చేయడం లేదన్నారు.
- కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు విపత్తు నిధుల కోసం రూ.3 వేల కోట్లు కేటాయించిందని హైదరాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, కృష్ణ, గిరిధర్, రాజేందర్ శర్మ తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

విజయనగర్‌కాలనీ: శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కవిత దరియానిరావు అన్నారు. కళలు, ఆర్కిటెక్చర్ రంగాలతో పాటు ఇతర విభాగాలలో మహిళలు చూపుతున్న ప్రతిభ ప్రశంసనీయమన్నారు. మంగళవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీలో అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు గెలుచుకున్న ప్రొఫెసర్ ప్రీతి సంయుక్తతో పాటు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను సత్కరించారు. విద్యార్థిగా ఉపాధ్యాయులుగా ఎదిగిన తర్వాత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే పట్టుదల మహిళలకే సొంతమన్నారు. ప్రతిభ కనబరచిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ కొడాలి సుందర్ కుమార్, ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గంగాధర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


బోనాల ఏర్పాట్లకు శ్రీకారం

చార్మినార్: ఆషాడమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా దేవాలయాల కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీకి నూతన అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ జరిగింది. దేవాలయ కమిటీ ప్రతినిధులు గురువారం రాత్రి దేవాలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించి ఆలే భాస్కర్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష బాధ్యతలను ఆలే భాస్కర్‌రాజ్‌కు అప్పగించాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రతిపాదనలను ప్రస్తుత అధ్యక్షులు రాకేశ్ తివారీకి అందజేశారు. ఏకగ్రీవ తీర్మానం మేరకు ఈ నెల 26న సాయంత్రం రాకేశ్ తివారీ ఆయనకు ఉమ్మడి బాధ్యతలను అప్పగించనున్నారు. దీంతో ఈసారి జరిగే బోనాల జాతర ఉత్సవాలు ఆలే భాస్కర్ రాజ్ అధ్యక్షతన జరగనున్నాయి. జూలై 9న ఘట స్థాపన ఊరేగింపు, 16న బోనాల సమర్పణ, 17న పాతబస్తీ వీధుల్లో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు ఉంటుందన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం

సుల్తాన్‌బజార్: ధరిత్రి పరిరక్షణపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తమ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాంబాగ్‌లోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగాగా పురుషోత్తమ్‌రెడ్డి హాజరై ప్రసంగించారు.

- వాతావరణ వేడికి ఉష్ణోగ్రతలు పెరిగి హిమాలయాలు కూడా కరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ మూలం కాలుష్య వాతావరణమేనని వీటిని అరికట్టాలంటే ప్రతి వ్యక్తి ఒక మొక్కను నాటాలని సూచించారు. ధరిత్రిని కాపాడుకోవడం అంటే మానవ జీవితాలతో పాటు భావితరాలను కాపాడటమేనన్నారు.
- ఉస్మానియా యూనివర్సిటీ జంతుశాస్త్రం మాజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ మురళీధర్ మాట్లాడుతూ.. మనం తాగేనీరు, పీల్చే గాలి, పండించే నేల జీవనోపాధి అంశాలని ఇది ఆరోగ్యంతో ముడిపడి ఉందన్నారు.


ధరిత్రి దినోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు, మేధావులు తదితరులు

- ప్రకృతి సమతుల్యత దెబ్బతినడంతో వాయు కాలుష్యం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌నారాయణ్ ముదిరాజ్, ప్రముఖ విద్యావేత్త, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులకు ఫోరం ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు.

ఆరోగ్యకరమైన జీవనానికి యోగా

గోల్కొండ: ఆరోగ్యకరమైన జీవనానికి యోగా తప్పనిసరి అని ప్రముఖ యోగా గురువు ఈశ్వర్ జోషి అన్నారు. మంగళవారం మెహిదీపట్నం సంతోష్‌నగర్ కాలనీ పార్కులోని యోగా సెంటర్‌లో ఆయన యోగా వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీపీ, మధుమేహం, కీళ్ల నొప్పులు, థైరాయిడ్ నుంచి ఉపశమనం పొందవచ్చని సూచించారు. సంతోష్‌నగర్‌లోని పార్కులో ప్రతినిత్యం యోగా తరగతులు ఉదయం 5 నుంచి 7 గంటల వరకు ఉంటాయని ప్రకటించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

డబీర్‌పురా: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 22వ తేదీన డబీర్‌పురా ఫ్లై ఓవర్ ప్రాంతంలో 50–55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా.. అప్పటికే మృతి చెంది ఉన్నాడు. దీంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి యువతుల అదృశ్యం

అఫ్జల్‌గంజ్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిగూడ చమాన్ ప్రాంతంలో నివాసం ఉండే సుభాష్ కూమార్తె ప్రియాంక (20) వృత్తిరీత్యా టైలరింగ్ పనిచేస్తూ.. ఉండేది. కాగా మంగళవారం ఉదయం టైలరింగ్ మెటీరియల్‌ను తీసుకొస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాకపోవడంతో తండ్రి సుభాష్ అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో..

డిగ్రీ చదువుతున్న మరో అమ్మాయి కాలేజీకి తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి కాలేజీలో వాకాబు చేశాడు. మీ అమ్మాయి కాలేజీకి రాలేదని కళాశాల సిబ్బంది చెప్పడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పద్మశాలీ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడిగా అంబటి శ్రీనివాస్



గోల్కొండ: కుల సంఘాలలో ఆయా కులస్తుల యువత క్రియాశీలంగా పనిచేయాలని బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జ్ టి.జీవన్‌సింగ్ అన్నారు. తెలంగాణ ప్రాంత పద్మశాలీయువజన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అంబటి శ్రీనివాస్‌ను మంగళవారం లంగర్‌హౌస్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో అంబటి శ్రీనివాస్ క్రమశిక్షణ గల నాయకుడని కొనియాడారు. పట్లూరి రఘు, సత్యంగౌడ్, రంగారెడ్డి, కావూరి వెంకటేష్ తదితరులున్నారు.

బయో సైన్సెస్ రంగంలో విస్తృత అవకాశాలు

చార్మినార్: బయో కెమిస్ట్రీ, న్యూట్రిషన్ తదితర బయో సైన్సెస్ రంగంలో విస్తృతమైన ఉన్నత విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలున్నాయని విశాల్ మావూరి అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో మంగళవారం బయో కెమిస్ట్రీ, అప్‌లైడ్ న్యూట్రిషన్ విభాగం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో విశాల్ అతిథిగా పాల్గొన్నారు. బర్కత్‌పురాలోని న్యూట్రివిండ్, నూట్రిలాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడిగా ఉన్న విశాల్ క్లీనికల్ నూట్రిషన్, స్పోర్ట్స్ న్యూట్రిషన్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికెట్ కోర్సులను నిర్వహించేందుకు బయో కెమిస్ట్రీ, అప్లైడ్ న్యూట్రిషన్ విభాగాలు వేర్వేరు ఒప్పంద పత్రాలపై సంతకం చేశాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బయోకెమిస్ట్రీ, అప్లైడ్ న్యూట్రిషన్ ఇన్‌చార్జ్, కె.సుమన, యాదగిరి, బయోకెమిస్ట్రీ సహాయ ఆచార్యులు సీ.హెచ్.విద్య విద్యార్థులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీలో పాల్గొన్న నామాల శ్రీనివాస్

ప్రపంచ మలేరియా దినోత్సవం

చార్మినార్: మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం జరిగిందని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ మలేరియా విభాగం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్ ఆదేశాల మేరకు మంగళవారం ఎంటమాలజీ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి చార్మినార్ నుంచి మదీనా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... మలేరియా నివారణకు చార్మినార్ జోన్‌లో విస్తృత్తంగా ‘ఆంటీ లార్వా ఆపరేషన్’ ప్రజలకు అవగాహన కోసం ఇంటింటి ప్రచారం చేస్తూ.. కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, మహిళా సంఘాల గ్రూపు సభ్యుల పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అసిస్టెంట్ ఎంటమాలజిస్టులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులున్నారు.

మహిళలకు పసుపు కుంకుమ భరణిలు పంపిణీ

అబిడ్స్: నవభారత్ నిర్మాణ్ సంఘం ఆధ్వర్యంలో పసుపు కుంకుమ, భరణిలు పంపిణీ చేశారు. అక్షయ తృతీయ సందర్భంగా పద్మాక్షికాలనీలో మహిళలకు సంఘం మహిళా కార్యదర్శి లయన్ లహరి ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ భరణిలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని మహిళలతోనే కుటుంబాలు బాగుంటాయన్నారు. లావణ్య, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

గోల్కొండ: ‘రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ఎదురులేదని బీజేపీ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని’ బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీవన్ సింగ్ అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం లంగర్‌హౌజ్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేడు ఇతర రాష్ట్రాలలో బలియమైన రాజకీయ శక్తిగా ఎదుగుతోందన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాలలో తప్పితే బీజేపీకి అసలు రాష్ట్రంలో బలమే లేదన్నారు. డివిజన్ స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతం అయ్యాయని, ఇదే స్ఫూర్తితో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించామన్నారు. మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, బీఆర్ఎస్ నాయకులు తూం కుంట అరుణ్ కుమార్, శేఖర్ రెడ్డి, వెంకటేష్ వివిధ డివిజన్‌ల నేతలు పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్‌లో..

విజయనగర్‌కాలనీ: కేసీఆర్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని హోంమంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. మంగళవారం నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ సూరజ్ గార్డెన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ ఎం.ఎస్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు డివిజన్‌లో పలు చోట్ల పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాంపల్లి నియోజకవర్గం సీ.హెచ్. ఆనంద్ కుమార్‌గౌడ్, డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, శీలం బాల్‌చందర్, మహ్మద్ సిద్ధిఖీ, రేణేశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.



హోంమంత్రి మహమూద్ అలీకి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

చార్మినార్: నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మహ్మద్ సలావుద్దీన్ లోధి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. మొఘల్‌పురా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణ, నాయకులు మహ్మద్ సోహేల్, మహ్మద్ ఖదీర్, మహ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని గౌలిపురా చౌరస్తాలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జెండా పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీ.ఎం.ప్రవీణ్‌రాజు పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీఆర్ఎస్ నాయకులు తిరుపతి శివకుమార్, నర్సింహగౌడ్, బొడ్డు సాయిబాబా, శారద, శివరాణి, అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ నాయకులు జీవన్ సింగ్ తదితరులు


గౌలిపురా డివిజన్‌లో సీ.ఎం. ప్రవీణ్‌రాజు